క్లుప్తంగా

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులు భర్తీ చేసేలా మెగా డీఎస్సీ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ మాజీ కార్యదర్శి మనోహర్, నగర కార్యదర్శి ఓబులేశు డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ సమయాన్ని పెంచాలని కోరారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

– మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలసిన డీఈఓ

కడప కార్పొరేషన్: జిల్లా విద్యాశాఖాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన అనురాధ నగర మేయర్ కె. సురేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ నూతన డీఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభినందన

వైవీయూ: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల అధ్యాపక నియామక పరీక్షల్లో వైవీయూ తెలుగుశాఖ పరిశోధక విద్యార్థులు ఓ. వెంకటయ్య (పీజీటీ–తెలుగు), డా. కె. నరేష్ (టీజీటీ–తెలుగు) ఉద్యోగాలు సాధించారు. వీరు ఈనెల 12న విశాఖపట్నంలో నిర్వహించే రోజ్‌గార్ మేళలో వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన వైవీయూ పరిశోధకులను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తదితరులు అభినందించారు.

పారదర్శకంగా క్లెయిమ్‌ల పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : ఫోటో ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత వచ్చిన క్లెయిమ్‌లను విచారించి పారదర్శకంగా పరిష్కరిస్తామని ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె. కౌసర్‌భాను ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 22న విడుదల చేసిన తుది జాబితా మేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 2,46,726 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో 1,19,678 మంది పురుషులు, 1,26,997 మంది మహిళలు, 51 మంది ఇతరులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 267 పోలింగ్ స్టేషన్ల పరిధిలోగల ఓటర్ల సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామన్నారు. తుది జాబితా ప్రచురణ తర్వాత అంటే గతనెల 30 నుంచి ఈనెల 5వ తేదీ వరకు క్లెయిమ్‌లు స్వీకరించామన్నారు. ఫారం–6లు 606, ఫారం–7 1432, ఫారం–8 1415 వెరసి 3453 క్లెయిమ్‌లు వచ్చాయని వివరించారు. ఇంకా ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్‌లో క్లెయిమ్స్ నమోదు చేస్తే విచారించి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

స్వచ్ఛభారత్

కడప ఎడ్యుకేషన్: స్వచ్ఛభారత్‌తోనే గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రం అవుతాయని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి అన్నారు. శుక్రవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా కొప్పర్తి గ్రామంలో ఏడు రోజుల స్పెషల్ క్యాంపు నిర్వహించారు. సంబంధిత క్యాంపుకు గ్రామ సర్పంచ్ సుజాత, ఇరిగేషన్‌శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్వరరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాంతీయ వైద్యశాలలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం గోపాల్‌రెడ్డితో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, ఏటీఎం హరి, విజిలెన్స్ ఆఫీసర్ ముజుబుర్ రెహ్మాన్, విజిలెన్స్ సీఐ గంగాధర్‌రెడ్డి, కడప డిపో సీఐ కన్యాకుమారి, ఎస్‌టీఐ మంజుల, వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాబా ఫకృద్దీన్, ఎస్ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే సీఎంగా జగనన్ననే ఉండాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగును నులిమేద్దాం

– కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప ఎడ్యుకేషన్: ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరిలో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పని సరిగా వేయాలని.. ఈ ఒక్క మాత్రతో నులిపురుగును నులిమేద్దామని కడప నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కడపలోని నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌లో నులి పురుగుల నివారణ దినత్సోవ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ నాగరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు తప్పని సరిగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతను పాటించకపోతే నులి పురుగులు చేరే ప్రమాదం ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్లనే వాడాలన్నారు. నులి పురుగులు పిల్లల కడుపులోకి చేరితో రక్తహీనత ఏర్పడటంతోపాటు అనారోగ్యానికి గురవుతారన్నారు. డీఎం అండ్ హెచ్‌ఓ నాగరాజు ఆరోగ్య విద్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్, డీపీఓ వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితా సుధారాణి పాల్గొన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి

– సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప ఎడ్యుకేషన్: బడిఈడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. శుక్రవారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పిల్లలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాండెడ్ లేబర్ నిర్మూలన ప్రాముఖ్యతను గురించి తెలియచేశారు. పిల్లలు కష్టపడి చదివి తల్లిదండ్రులతోపాటు చదివిన విద్యాసంస్థకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సాంబశివరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసులు, ఎంఈఓ పాలెం నారాయణ, ఇంచార్జ డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ప్రకృద్దీన్

ఇంధన పొదుపు పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని ఆర్టీసీ కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, ఓం శాంతి ప్రతినిధి ప్రదీప అక్కయ్య తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఇంధనం పొదుపు పాటించని డ్రైవర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లకు ఒత్తిళ్లు, మానసిక ఆందోళన తగ్గించడం కోసం క్రమం తప్పక ధ్యానం చేయాలని సూచించారు. డ్రైవరు విధి నిర్వహణలో పంచసూత్రాలు పాటించినట్లయితే ప్రమాదాలు జరగడం, తక్కువ కేఎంపీఎల్‌గానీ రాదన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైవర్లు విధులకు మద్యం సేవించి రావడం, ప్రయాణీకుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో పట్టుబడటం, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని ఎలాంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అత్యల్ప కేఎంపీఎల్ తెచ్చే డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు మాట్లాడారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్ఎంఏజీ బాష ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ వద్దు

కడప కల్చరల్ : ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి కోరారు. దేశవ్యాప్త పిలుపుమేరకు శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ఎల్ఐసీలో నూతన నియామకాలు, ప్రీమియంలపై జీఎస్టీ రద్దు తదితర డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం గత తొమ్మిది సంవత్సరాలలో చొరవ చూపలేదని విమర్శించారు. వేతన సవరణ కోసం తాము 18 నెలలుగా ఎదురుచూస్తున్నామని, పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీని తగ్గించాలని సూచించిందని, అయినా ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయాలు రాలేదని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్, యూనియన్ నేతలు వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, అమీనా పర్వీన్, శ్రీవాణి, కుమార్, జయచంద్ర, నరసయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీమా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

విద్యాశాఖ అధికారులకు సత్కారం

కడప స్పోర్ట్స్: పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన వై. రాఘవరెడ్డి, డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎం. అనూరాధను వైఎస్ఆర్ కడప జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు కలసి సత్కరించారు. శుక్రవారం ఆర్‌జేడీ, డీఈఓ కార్యాలయాల్లో వేర్వేరుగా అధికారులను కలిసి వారికి మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని పూలమాల, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, సలహాదారుడు ఎస్. జిలానీబాషా, కార్యవర్గ సభ్యులు సీవీఎస్ రాయుడు, చంద్రావతి, షాహిన్, అగ్గిరప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జేడీ వై. రాఘవరెడ్డిని సన్మానిస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు

అత్యుత్తమ పనితీరుకు ప్రశంస

కడప అర్బన్: పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబర్చిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు'ను అందచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందచేసి ప్రత్యేకంగా అభినందించారు.

– మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తిస్తున్న వై. రమేష్‌బాబు ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.31.5 లక్షల నగదును వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించారు.

– ఇటీవల ప్రొద్దుటూరులో భారీగా గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన రాజుపాలెం పి.ఎస్. హెడ్‌కానిస్టేబుల్ కె. నాగాంజనేయులు (హెచ్‌సి. 213), ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ పి.ఎస్. హెడ్‌కానిస్టేబుల్ డి.బాబా ఫకృద్దీన్ (హెచ్.సి 2146)లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రం, నగదు రివార్డు అందచేశారు.

– డి.సి.ఆర్.బిలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఏ.ఆర్. కానిస్టేబుల్ బి.ఎన్. పెద్దిరాజు (ఏ.ఆర్.పి.సి.420) ను ఎస్పీ అభినందించారు.

– 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు' అందుకున్న సిబ్బంది ముందుందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.



అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి అవార్డు అందజేస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ఘనంగా భస్మార్చన



భస్మార్చనలో అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. వేకువజామున స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, సహస్రనామ భస్మార్చన నిర్వహించి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ పాల్గొన్నారు.

పగటిపూట వీధిలైట్లు వెలిగితే చర్యలు తప్పవు

– విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ హెచ్చరిక

కడప కార్పొరేషన్: పలుసార్లు సూచనలు చేస్తున్నా పగటిపూట వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయని, ఇకపై ఎక్కడైనా లైట్లు వెలిగితే సిబ్బందిపై తగు చర్యలు తప్పవని విద్యుత్ శాఖ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించుటకు అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్య ధోరణి విడనాడి లైన్ల వెంబడి తిరిగి లోపాలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు, లైన్లకు అడ్డు వచ్చిన కొమ్మలను కత్తిరించి, అంతరాయం లేని నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను ప్రజలకు అందించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, విద్యుత్ బకాయిల వసూళ్లను ఖచ్చితంగా రాబట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరి చేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నామని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫకృద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నైట్ అవుట్ డ్యూటీలు చేసే సిబ్బందికి నెలవారి జీతం బిల్లు ద్వారా అలవెన్స్‌లు చెల్లించేవారన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాల బిల్లులను అమలు చేసిన తర్వాత రాత్రి పూట అలవెన్సులు తాత్కాలికంగా నిలిపి వేశారన్నారు. అయితే ప్రభుత్వం దీనిపై చొరవ తీసుకుని నైట్‌అవుట్ అలవెన్సులను జీతంతో కలిపి చెల్లించేందుకు ముందుకు వచ్చిందని, ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.



బాబా ఫకృద్దీన్

రేపు ఘంటసాల వర్ధంతి

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన శ్రీ రాగ రంజని ఆర్కెస్ట్రా సంస్థ ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఈనెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు అంజి, నరసింహాచార్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని కో ఆపరేటివ్ కాలనీ నెహ్రూ పార్కులోగల ఘంటసాల విగ్రహం వద్ద సినీ సంగీత విభావరి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

కడప అదనపు కమిషనర్‌గా రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా కూచిపూడి రాకేష్ చంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గత ఏడాది విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వై ఓ నందన్, జిల్లా సహాయ ఆడిట్ అధికారి శ్యామ్యూల్ డెన్నీ, పలువురు అధికారులు ఉద్యోగులు రాకేష్ చంద్రను అభినందించారు. అనంతరం ఆయన మేయర్ సురేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. కొత్త అడిషనల్ కమిషనర్‌కు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన రాకేష్ చంద్ర

ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ప్రాక్టికల్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నాయని, అలాంటి కళాశాలలపై విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కడప ఆర్ఐఓ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాక్టికల్ పేరుతో అక్రమాలకు పాల్పడిన కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కడపతోపాటు బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సిండికేట్ అయి అధిక మార్కులను వేయిస్తామని పిల్లల నుంచి 15 వందల రూపాయలను రాబట్టారని ఆరోపించారు. సంబంధిత కళాశాలలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, విష్ణు, నరసింహ, రాజా, అప్సాన్, బ్రహ్మయ్య, మహేష్, చంద్ర, బాబు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.1 లక్షా 50 వేలు విరాళం అందించినట్లు కమలాపురం మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల క్రితం సచివాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎంపీని ఎస్సీ కాలనీ వాసులు ఆలయానికి విరాళం ఇవ్వాలని కోరారు.

సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్



ఎర్రగుడిపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ కేరాఫ్‌గా మారిందని వైఎస్సార్ సీపీ, జేసీఎస్ మండల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుడిపాడు సచివాలయ పరిధిలోని ఎర్రగుడిపాడు, రాయునిపేట గ్రామాల్లో వారు నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయని, దీంతో సంక్షేమ పథకాలకు రాష్ట్రం కేరాఫ్‌గా మారిందన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి అందాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, శివకుమార్‌రెడ్డి, దాసరి సురేష్, కొండారెడ్డి, రామిరెడ్డి, శివకృష్ణారెడ్డి, గఫార్ గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

చెన్నూరు : సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తూ ఆదరించాలని జెడ్పీటీసీ సభ్యుడు నరస్ రామాంజులరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెన్నూరు టౌన్‌లోని రెడ్డి వారివీధి, మట్టవారివీధి, చౌడమ్మ వీధి, పాత గాంధీ నగర్‌లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథకంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌పీఎస్ఆర్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ముదిరెడ్డి రవిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఎర్రసాని నిరంజన్ రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, సొసైటీ అధ్యక్షుడు శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, నాయకులు సత్యరాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్యపూజయ్య, అన్వర్‌బాషా, అబ్దుల్ రబ్, మునీర్ అహ్మద్, వారిస్, హస్రత్, సాదక్ అలీ, జుమన్ పాల్గొన్నారు.



చెన్నూరు: ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేష్ రామాంజులరెడ్డి, నాయకులు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరులో శుక్రవారం ప్రతి గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి, మీకు మంచి జరిగిందంటేనే ఓటు వేయ్యండని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఏనాడైనా ఇలా చెప్పాడా అని ఆయన అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి అధికారం కొరకు ప్రాకులాడుతున్నాడే తప్ప ప్రజలకు మంచి చేస్తామన్న ఆలోచన చంద్రబాబుకు లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక సర్పంచు లక్ష్మిదేవి, ఎంపీటీసీ లక్ష్మిరామాంజనమ్మ, నాయకులు గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, బీసీ నాయకుడు రంగనాయకులు పాల్గొన్నారు.